# ఓ జాలికథ

శ్రీమతి జి. హేమంత

సమాజం ఆవరణంతా కళ కళ్లాడుతోంది. స్టేజిఅంతా రంగుకాగితాలతో మామిడి తోరణాలతో అలంకరించారు, సర్వమత సమానమైన గుర్తుముందు మోకరిల్లి ప్రార్థన ముగించి, రామారావు, ప్రేమలత, స్వామీజీ సమాజం ప్రెసిడెంటు స్టేజి మీదకు, మిగతా ఆహూతులంతా స్టేజికి దగ్గర్లో క్రిందభాగాన ఏర్పాటుచేసిన కుర్చీలపై కూర్చున్నారు. అందరి సమక్షంలో రామారావు, ప్రేమలత ఎన్నో ఆశలు, కోర్కెలు నింపుకున్న నిండైన మనసులతో, ఆనందంగా అందరి ఎదుట దండలు మార్చుకున్నారు. వారిద్దరి చేతులు కలిపి ప్రమాణాలు చేయించారు స్వామిజీ అంతకంటే సంతోషం నిండిన మనసుతో!

అంతటితో ప్రేమ, రామారావుకి భార్య అయింది. సమాజంలోవున్న రిజిష్టర్ లో సంతకం చేసారు, దంపతులిద్దర్నీ చెరో వైపు కూర్చో బెట్టుకున్నారు స్వామీజీ. కొంతసేపు మౌనందాల్చి.... గంభీరంగా లేచి నిల్చున్నారు స్వామీజీ ఏదో మాట్లాడాలనే వుద్దేశ్యంలో. సభికులంతా శ్రోతలుగా మిగిలారు,

"అతిపవిత్రమైన యీసమాజంలో వివాహం జరిగిన రామారావు ప్రేమలత సర్వదా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశీర్వదిస్తున్నాను 'ప్రేమలత' యీసమాజానికి ముద్దుబిడ్డ, ప్రేమమూర్తి. ముఖ్యంగా నాకెంతో ప్రాణప్రదమయింది. ఈ బిడ్డ యీనాడు సమా

జానికి దూరంగా మరో సమాజంలో అడుగుపెట్టబోతోంది, అందుకు ఒక యువకుడు సాహసంతో చేయూతనిచ్చాడు. అతి సున్నిత మనస్కురాలయిన యీ ప్రేమ మూర్తిని ఇతని చేతుల్లో పెడుతున్నాం

ఆమెను జీవితాంతం తన అర్ధాంగిగా కష్ట సుఖాలలో పాలుపంచుకొని ఆమెకు ఏ విధమైన అసంతృప్తి లేకుండా కాపాడు కోవలసిన భాధ్యత అతనికి వుంది. సంసారమనే బండికి చక్రాల్లాంటివారు భార్యా భర్తలు. ఇది వరకూ యీసమాజం యువతీ యువకులు వివాహాలు చేసుకొని ఇదే తమ పుట్టిల్లుగా భావించుకొని ఎప్పుడు వస్తుంటారు. కానీ ఈవిధంగా సమాజం అధ్వర్యంలో జరగడం యిదే ప్రథమం రామారావు కోరికపై యిలా మీఅందరి సమక్షంలో జరుపబడింది. దీనిని మీరంతా జయప్రదంగావించారు ! అంటూ గంభీర స్వరంతో ముగించారు. తరువాత రామారావు ఏర్పాటు చేసిన తేనీటి విందు ముగిసింది

● ● ●

పిల్లలంతా చదువు, భోజనాలు, ముగించి పడుకునేముందు అందరూ కలిసి చేసిన దైవప్రార్ధన ముగించి ఎవరిస్థలంలో వాళ్లు వెళ్లి పడుకొన్నారు సాయంత్రింనుండి అలసివున్న ప్రేమకూడా తనకు నిర్ణీతమైనస్థలంలో పడుకొంది. పక్కమీదకు శరీరమైతే చేరిందికానీ.... మనసంతా ఏదో అనిర్వచనీయమైన ఆనందంతోనూ. భయంతోనూ నిండిపోయింది, ఎంత అణగద్రొక్కుదామన్నా ఆలోచనలు వువ్వెత్తున పైకిలేస్తూనేవున్నాయి.

“ తనకి ‘ అమ్మ ’ అన్న పిలువు వచ్చేసరికే ‘ పెద్దక్క ’ పెద్దన్నయ్య కనబడ్డారు. అక్క అనటం రాక ‘ అమ్మ ’ అనే పిలిచేది. తనకు బాగా జ్ఞానం తెలిసేసరికి ఇక్కడున్న ప్రతి వాళ్లు అన్నయ్యలు, అక్కయ్యలు అయ్యారు. స్వామీజీ తనపై చూపే ప్రత్యేకమైన అభిమానం, ఆప్యాయతల మధ్య సమాజపు ధర్మాలను జీర్ణించుకుని పెరిగింది, కష్టం అంటే ఏమిటో తెలీకుండా కుళ్లూ కపటంలేకుండా యీసమాజంలో అంతా ‘ నావాళ్లే ’ అన్న భావంతో పెరిగింది. బయట ప్రపంచంతో సంబంధం లేకుండా పెరిగింది. సమాజం స్కూల్లోనే ఎస్. ఎస్. ఎల్. సి వరకూ చదివింది. తరువాత ఏ ట్రైయినింగులకూ వెళ్లడం ఇష్టంలేక అక్కడే ఆపనీ ఈపనీ ముఖ్యంగా స్వామీజీపని చూసుకుంటూ క్రొత్తగవచ్చిన పిల్లలను ఆదరంగా సాకుతూ కాలం గడుపుకునేది. సమాజం ఫండ్స్ కోసం వేసే నాటకాల్లో వేషం వేసే ఈ రామారావు, స్వామీజీవెంట తిరిగే తన మీద

కన్ను వేసి.... స్వామీజీతో తనకు తెలీకుండా నే మాట్లాడి అనుమతి పొందడం.... అంతా కలలా జరిగిపోయింది. . ఇక తను కొత్త జీవితంలో అడుగు పెట్టబోతూంది పూలబా టవుతుందో, ముళ్ళదారి అవుతుందో, పెళ్లి ళ్లయిన అక్కలు. అన్నలు అప్పుడపుడు వస్తుంటారు కొందరు రెస్ట్‌కోసం, మరికొం దరు చూడ్డానిక .. వస్తుంటారు. కానీ వాళ్లే వరిద్వారా ' ఆజీవితం ' ఎలావుంటుదో విన లేదు. ఈసమాజాన్ని, ఈచిన్నారి చెల్లెళ్లను తమ్ముళ్లను, స్వామీజీని వదిలి తను వెళ్లగ లదా? అసలు పరిచయం లేని ఆ క్రొత్త వ్యక్తి తో తను నిబ్బరంగా జీవితం వెళ్లమార్చగల దా ? ఏమో

స్వామీజీ నిర్ణయించిన జీవిత మది- అది ఎటువంటిదయినా ఆయన నిర్ణయంలో తన కు నమ్మకముంది తనపిల్లలు తనలా అనాధలు కారు— తన పిల్లలకు తను అమ్మ అవుతుం ది,— వాళ్లను సమాజానికి దీపాలుగా చే స్తుంది. యిక్కడ తను నేర్చుకొన్న, తెలుసు కొన్న జ్ఞానం వూరికే పోనివ్వదు, పోదు. తన ఇంటికి దీపమవుతుంది.——''

ఆలా కలల్లో నుండి నిద్రలోకి జారి పోయింది, ఏ తెల్లవారు ఝామునో !

● ● ●

ప్రార్ధనామందిరం ప్రక్కనే వున్న మామిడి చెట్టుక్రింద తెల్లని దుప్పటి పరచిన మడత మంచంపై వెల్లకిలాపడుకుని కొమ్మ ల చాటునుండి తొంగి, తొంగి చూస్తున్న వెన్నెల రేఖలను చూస్తూ ' ప్రేమ ' తో తన జీవితం గురించి ఆలోచిస్తూనే గడిపి వేసాడారాత్రి రామారావు. "ప్రేమ ! నిజంగా ప్రేమమూర్తి ఆచూపుల్లో వింతకాం తి, తీర్చిదిద్దిన కనుబొమలు, నల్లని పొడవైన జడ, నడుస్తుంటే పిరుదుల మీద అటూ- ఇటూ నాట్యం చేసే నల్లని జడ ఎంత అం దంగా వుంటుందని మనసులాగే, మనిషి కూడా చాల అందమైనది ఆకళ్లలోని ఆకర్ష ణే తనను కావాలినుకునేలా చేసింది రెండు మూడేళ్ల నుండి పరిచయం వున్నా ఒక్కసారి తనతో సూటిగ కళ్లెత్తి మాట్లాడలేదు ఎటు వంటి కష్టము కలుగకుండా ప్రేమగా చూసుకోవాలి '' ఇలాంటి ఆలోచనలతో రాత్రిగడచి పోయింది.

కలత నిద్దురలోవున్న ప్రేమకు నీర వ నిశ్శబ్ధంలో అతి మృదువుగా తేలివచ్చే శ్లోకాలు మెలకువ తెప్పించాయి. ఆయనతో ఏదో మాట్లాడాలన్న తపనతో చటుక్కున లేచి కూర్చుంది. " అందర్ని విడిచి. ఈ పరిసరాలనుండి ఆ కొత్త వ్యక్తితో వెళ్లి

పోవాలి '' అన్న ఆలోచనే భీతహరిణిలా చేస్తోంది. స్వామీజీ ఆప్యాయతగా భయం పోగొట్టేరెండు మాటలకోసం ఆరాటపడుతోంది మనసు. వెంటనే లేచి చీరచెంగు తలమీద నుండి వేసుకొని స్వామీజీ గదిముందు కూర్చుంది. అక్కడక్కడ పిల్లలు లేచి చదువుకుంటున్న శబ్దం మాత్రం చెవుల్లో పడుతుంది చిన్నగా !

● ● ●

బ్రహ్మముహూర్తంవేళ. నందివర్ధనం పూలు నక్షత్రాల్లా మెరుస్తున్నాయ్! తోగర చెట్లనుండి, పారిజాత పుష్పాలనుండి వస్తున్నగాలి పరిమళాలు వెదజల్లుతున్నాయి, ఆసమయంలో స్వామీజీ స్నానం చేసుకుంటూ చెప్పుకొంటున్న శ్లోకాలు మృదు మధురంగా గాలిలో తేలి మనసును పుత్తేజ పరుస్తున్నాయ్ ఆయన రాకకోసంవుద్విగ్న మనస్కయై ఎదురు చూస్తోంగి,

వయో భారంతో కృంగిన శరీరం పండుటాకులా వణికిపోతోంది, పచ్చని మేనిపై కాషాయవస్త్రం అదోవిధమైన తేజస్సును కలుగ చేస్తున్నది. మెడలో రుద్రాక్షమాలతో ఛాతీవరకూ పెరిగిన పండిమెరుస్తున్న గెడ్డంతో దివ్యంగా వున్న ఆ మూర్తిని చూస్తూనే పాదాలముందు మోకరిల్లింది ప్రేమ

ఆదరంగా అక్షున చేర్చుకున్నారు. " బిడ్డా ! నీ బాధ, భయం, నాకర్థం అవుతున్నాయి. జీవితం అంటే ఇదే కాదమ్మా.... నువ్వింకా జూడవలసిందిచెయ్య వలసింది చాలావుంది— అదంతా అయితేగాని నీవు పరిపూర్ణురాలవు కాలేవు నీజన్మకు సార్థకత లభించాలంటే, నీవు పరిపూర్ణురాలవు కావాలంటే సంసారమనేసాగరంలో ఈదులాడాలి మాయా, మత్సరంతో, కామ, క్రోధాలతో నిండిన ఆలోకంలోకి ప్రేమమూర్తివయిన నిన్ను పంపిస్తున్నాను వాటి నెదిరించి గెలుపొందడమే నీవు చెయ్యవలసినపని. ధైర్యం గావుండు. నీమనసు అస్థిరమై— ఆసమాజంలో నీవు నిలువలేనప్పుడు నీకు శాంతిని ప్రసాదించేందుకు ఈసమాజం— నీకోసం, నీ ప్రేమకోసం, ఆరుస్తాలుచాచే నూతన శిశువులు ఎల్లప్పుడూ ఎదురుజూస్తూవుంటారు నువ్విక్కడ నేర్చుకొన్న ఓ. న. మాలు నీతోనే కలకాలం నీకోసం, నీవాళ్ళకోసం, వుండాలని ఆశీర్వదిస్తున్నాను. నీకేమీ భయంలేదు మెల్లగ తలనిమురుతూ చెప్తుంటే ఆచేతుల్లో నుండి ఏదో అజ్ఞాతశక్తి అభయమిచ్చింది కళ్లుమూసుకొనివున్న ప్రేమను అలాగే వదలివెళ్లి ధ్యానంలో మునిగిపోయారు స్వామిజీ

అంతలో బెల్ వినపడడంతో అక్కడినుండి లేచి వెళ్లింది ప్రేమలత.

● ● ●

తనదంటూ ఏమీలేని ప్రేమలత స్వామీజీ కొన్న రెండు చీరలు ఒక సంచిలో పెట్టి రామారావు కొన్న పెళ్లి చీర కట్టుకొని మనిషి మనిషి పేరున చెప్పి మధ్య మధ్య కళ్లుతుడుచుకొంటూ స్వామీజీకి ప్రణామం చేసి బయలుదేరింది. అదంతా చూస్తున్న రామారావుకు కళ్లు చెమర్చి అలనాటి శకుంతల గుర్తు వచ్చింది. అప్రయత్నంగా ! రామారావు చెయ్యి పట్టుకొని నవ వధువుగా గేటుదాటుతువుంటే ఒక్కక్షణం కాళ్లు వణికి గుండెలు అదిరాయి, కన్నీళ్లతో వీడ్కోలు ఇచ్చి టాక్సీ ఎక్కింది. ట్రాఫిక్ను చీల్చుకుంటూ ఈ విశాల వింత ప్రపంచంలోకి దూసుకు పోయింది టాక్సీ,

తొలిరేయి అనుభవంలో రామారావులో కొత్త మనిషిని చూసింది ఎన్నడూ తను చదివే కథల్లోగాని, మరొకరి మాటలద్వారాగానీ ఆ అనుభవపుఛాయలు కూడా తెలీని ప్రేమకు ఆ అనుభవం భయంకరమైనదిగా, అతనిలోని రాక్షసత్వానికి ప్రతీకగా అనిపించి 'రాత్రి' నే భయంకరమైన కలగా మార్చివేసింది.

" భగవాన్— అల్పమైన, తుచ్ఛమైన యీశారీరక సుఖం కోసమా యీబంధం— స్వామీజీ ఎందుకీ బంధంలో నన్ను ఇరికించారు. మీకు తెలీదా నేనాలాంటిదాన్నో ? '' మనసు మూగగ రోదించింది.

పెళ్లి చేసుకొన్న సందర్భంగా అఫీలో ముఖ్యులను కొంతమందిని పార్టీకి పిల్చాడు రామారావు. వాళ్లంతా పొగడ్తలతో ముంచెత్తుతూవుంటే మంచు బొమ్మలా కూర్చుంది ప్రేమ.

" మీ శ్రీమతితో సహా సినిమాకి రావాలని పేచీపెట్టారు సరే నని మొహం కడుక్కురావడానికి లోపలికి వెళ్లాడు రామారావు. ఆవెనకే లేచివెళ్లింది ప్రేమ లోపలికి, కిటికీ తలుపులు మూస్తున్న ప్రేమ అచేతనంగా నిలబడిపోయింది.

" సమాజం పిల్లరా, పోతేపోయిందిగాని గొప్పఛాన్సు కొట్టేసాడులే, గట్స్ ! వుండాలి దేనికయినా, అటు పెద్ద సంస్కర్తలా పేరుకొట్టేసాడు . బంగారంలాంటి పిల్లను చేపట్టాడు '' ఏడుపుదిగమింగుతూ అన్నాడొకడు. " పిల్లబంగారంలాగేవుంది, ఎంత

కక్షి పూండో అందులో! గొప్పకోసం చేసుకొన్నాడు!" అన్నాడు మరొకతను. "ఛ-ఛ— ఫూరుకోండి వాడింటికొచ్చి ఇలా మాటలాడ్డం ఏమీబాగులేదు. సభ్యతకూడాకాదు. కనీసం ఇప్పుడు తిన్న టిఫిన్‌కన్నా విశ్వాస ముంచండిరా! ఎవడో ముందుకువచ్చి వుదారంగా అలాంటి వాళ్లను చేసుకొచ్చి సంఘంలో ఇంతస్థానం కల్పించాలనుకొన్నా మీలాంటివారు దాన్ని విఫలం చేస్తార్రా! మనలో ఎవడికీ అంతధైర్యంలేదు పెళ్లాలు తెచ్చిన కట్నం డబ్బుల్తో సరదాలు తీర్చుకొంటున్నాం." సన్న సన్నగ చీవాట్లెసాడు ఇంకొకడు.

మొహం కడుక్కువచ్చిన రామారావు ఆగదికీ, ఈగదికీ మధ్యనున్న కిటికీ వారగా స్థాణువులా నిలబడిన ప్రేమను చూసి నుదురు చిట్లించాడు. "ఏయ్! ఏంచేస్తున్నావిక్కడ ఇంకాతయారవకుండా!" వులిక్కిపడింది. ఆకంఠంలోని కరుకుదనానికి కళ్లలో చివ్వున నీరు చిమ్మింది అతనికి కనబడకుండా దాచేసుకుని వెళ్లి అయిదు నిముషాల్లో తయారయి వచ్చింది.

రామారావు కెంతమాత్రం ప్రేమను తీసుకువెళ్లడం ఇష్టంలేదు కానీ, మర్యాదకోసం అంగీకరించాడు. సినిమాలో కూర్చున్నాడన్నమాటేగానీ, మనసంతా ఇందాకటి సంఘటన మీదేవుంది. అతని గురించేమీ పట్టించుకోని ప్రేమ సినిమా చూడటంలో నిమగ్నమయి ఫక్కున నవ్వేసరికి ముందున్నవాళ్లు వెనక్కి తిరిగి చూసారు, "ఏమిటా నవ్వు?" ఒక్క కసురు కసిరే సరికి నత్తగుల్లలా ముడుచుకు పోయింది. అంతే! ఆ తరువాత మరి సినిమాపై దృష్టిపోలేదు, ఇంటికి వచ్చాక భర్త సీరియస్‌నెస్ ఎలా పోగొట్టాలో అర్థంకాలేదు ప్రేమకు. భోజనం ముగించి అతను పడుకొన్నాడే కానీ! కాలేకడుపుతో. స్వామీజీని తలచుకొంటూ ఉబుకుతున్న దుఃఖాన్ని గుండెల్లో ఇముడ్చుకొని అర్ధరాత్రి దాటాక నిద్రలోకి జారుకొంది.

"సాయంత్రం రాజారావు, అతని భార్య వస్తారు. ఏదయినా టిఫిన్ చేసివుంచు' చెప్పేసి ఆఫీసుకువెళ్లిపోయాడు.

వుల్లిపకోడీచేసి, కాఫీ డికాక్షన్‌వేసి వుంచింది. తలదువ్వుకొని, వాళ్ల రాకకోసం ఎదురుచూస్తు కూర్చుంది. ఆఫీసు నుండి వస్తూనే— 'పెళ్లికూతుర్లా తయారవాలేమిటి?' కాస్త చికాగ్గా అన్నాడు.

మనసు చివుక్కుమని 'ఏమంటే ఏం

తప్పో ' నని నెమ్మదిగా వంటింట్లోకి వెళ్ళి పోయింది

" యీ చీర అతనే కావాలని సరదా పడి కొన్నాడు ఎప్పుడు కట్టుకొన్నా ఇలాంటి మాటలే అంటాడు. అసలు ఇంతవరకూ అతని మనస్తత్వం ఏమిటో అర్ధం కావడం లేదు కావాలని తనపర్మిమేయంలేకుండా స్వామీజీతో మాట్లాడి చేసుకొన్నాడు ప్రతి నిముషం దేనికో దానికి చిరచిర లాడుతుంటాడు, మనుష్యుల్ని హత్యచేసే వాళ్లని హంతకులంటారు. మనసుల్ని హత్యచేసే వాళ్ల నేమంటారో ? '' వుడికిపోతున్న మనసు తలుపు చప్పుడికీలోకం లోపడింది.

రాజారావు అతని భార్య శ్యామల వచ్చారు తెల్లని పల్చని నైలాన్ చీరలో నుండి, జాకెట్టులోనుండి ' బాడి ' స్పష్టంగా కనపడుతుం టే ముందుగా ప్రేమ దృష్టి అటే పడింది అందకత్తె కాకపోయిన ఆకర్షణీయంగా కనబడాలని పడే అవస్థ కొట్టొచ్చినట్టు కనపడుతూనేవుంది.

" నమస్కారమండి ! '' అంది దగ్గిరగావచ్చి.

ప్రతినమస్కారం చెయ్యాలని కూడా తెలిలేదు ఆ ఆధునిక యువతికి, రెప్పవాల్చకుండా అలాగే చూస్తూ వుండిపోయింది కొద్దిక్షణాలు.

రాజారావు మాత్రం ప్రతినమస్కారం చేసాడు.

' రండి ! ' అంటూ గదిలోకి నడిచింది ప్రేమ,

వెనక్కి తిరిగేసరికి నల్లని బారెడు జడ చూసి ఇంకా అప్రతిభురాలై అచేతనంగా ఆమెను అనుసరించింది ఆనవనాగరిక యువతి.

అక్కడే వరండాలో వున్న కుర్చిల్లో కూర్చున్నారు స్నేహితులిద్దరూ !

' మీరేం చదువుకొన్నారు ? ' కుర్చీలో కూర్చుంటూనే అడిగింది శ్యామల

' ఎస్. ఎస్. ఎల్, సి. అండీ ; ' మీరో ? అడిగింది,

' బి ఏ. చదివాను. టెలిఫోన్ ఆఫీసులో చేస్తున్నాను. గొప్పగ కళ్లెగరేస్తూఅంది

' అయితే రామారావుగార్కి, మీకు ఎలాపరిచయమయింది మీ సమాజంలో

వాళ్ళంతా ఇలాగే 'లౌ' మేరేజెస్ చేసుకుంటారులా వుంది. అవును మరి ఏదో ప్రయత్నం చేసి చేసుకోపోతే తల్లి, తండ్రి, ఎవరున్నార ని పట్టు పట్టి చెయ్యడానికి ?' ప్రశ్న, సమాధానం తనే చెప్పేసుకొంటుంటే అయోమయంగా చూస్తూ వుండిపోయింది క్రాస్‌ఎగ్జామిన్ చెయ్యటానికి వచ్చినట్లుగా మళ్ళీ తనే మొదలుపెట్టింది

'ఓమాటడుగుతాను ఏగ్గ అనుకోకండే, ? ఆదేమిటో నాకు మనసులో మాట బయటకు కక్కేయకపోతే గుండె బరువయిపోతుంది సుమండీ !' అంటూ తనకు తనే ఓ కాంప్లిమెంట్ పారేసుకొంది శ్యామల,

మాటలాడుతుంన్న మాటెగానీ ఒళ్ళంతా తేళ్ళు, జెర్రులు ప్రాకినట్లేవుంది ప్రేమకు.

'అడగండి !' మర్యాదకోసం అంది

'నురేం లేదు, అక్కడ వయసొచ్చిన ఆడపిల్లలు, మగపిల్లలు, కలసి వుంటారు కదా ! బాగుంటారా ? — అదే— ఏమైనా ఎఫైర్స్ జరుగుతుంటాయా ? ఆ ఏమిటో నా పిచ్చి— అందరూ ఒకేలాగ వుంటారా ? ఆడ మగ, ఒకదగ్గరున్నాక ఎలాగూవుంటా ఋ—'

అని తెల్చేసరికి కళ్ళమ్ముదున్న శ్యామల తల క్రిందులుగా కనుపించింది.

'యిప్పుడే వస్తానుండండి !' అంటూ ఎలాగో వచ్చి వంటింట్లో పడింది.

'స్వామీజీ యిలాటి మాటలు వినడానికా, ఇటువంటి హేయమైన మనుష్యుల మధ్యజీవితం గడపడానికా నన్నా సమాజం నుండి దూరం చేసారు ? ఛీ— ఛీ— చదువుకొందట— వుద్యోగం చేస్తుందట— ఇదేకాబోలు చదువు నేర్పిన సంస్కృతి ఇటువంటి వాళ్ళు మనుష్యులేనా ఇటువంటి వాళ్ళేమో తమ సమాజాన్ని, పవిత్రమైన తమ వునికిని ఎత్తి చూపుతారా ? సాటి మనిషిని ప్రేమించ లేని వీరు సమాజానికి విలువ కడతారెందుకు ?—'

'కాఫీ అవలేఇంకా, ఇక్కడొచ్చి వుండి పోయావేం ?' అంటూ వచ్చాడు రామారావు,

'ఆఅమ్మాయిని అన్ని అడిగేసరికి జవాబు చెప్పలేక వెళ్ళిపోయింది !' గుసగుస లాడింది అప్పుడే వచ్చి కూర్చున్న భర్త తో !

'గొప్ప పనిచేసావ్ ! ఏవో వెధవ

మాటలాడివుంటావ్ ' రాజారావు కసిరేసరికి మంటెత్తిపోయింది శ్యామలకి. అంటే అదొక మహాపతివ్రిత అనుకుంటున్నారా ? కాస్త తెల్లతొక్క కనబడే సరికి మీ మగాళ్లకి మతులు పోతుంటాయ్, ఎంతమంది చేతుల్లో నలక్కుండా యీ రామారావుకు వలవేసిందంటాను— ఇలాంటి వాళ్లను ఇంతమందిని చూసాను—' ఇన్ని తలవెంట్రుకలు పట్టుకొని చూపిస్తూ రెచ్చిపోయింది,

' సాటి ఆడదానిమీద మరో ఆడదానికి ఎందుకో ఇంత ఈర్ష్య ' అనుకుంటూ సిగ్గుతో చచ్చి పోయాడు రాజారావు.

' పోన్లే వూరుకో వస్తున్నారు ' బ్రతిమాలుతూ అన్నాడు ,

' యిప్పుడివన్ని ఎందుకు ' అంటూనే పూర్తి చేసారు. ఆవెంటనే ముగ్గురూ లేచారు వెళ్లడానికి ' వస్తామండీ ' మర్యాదగా చెప్పాడు రాజారావ్ కాస్త చిరాగ్గానే వాళ్లవెంటపడింది శ్యామల. కనీసపు మర్యాదయినా పాటించకుండా !

' హమ్మయ్య ! తేలిగ్గా నిట్టూర్చింది ప్రేమ. గాలివాన వచ్చి పోయినంత ప్రశాంతంగా అయిపోయింది మనసు. కప్పులు, సాసర్లు కడుగుతుంటే చెప్పలేని దుఃఖం ముంచుకువచ్చింది. కన్నీళ్లు జారి కడుగుతున్న గిన్నెలపై పడుతుంటే అక్షణంతో యిలాంటి దుర్భరమైన బ్రతుకు బ్రతకలేనని అనిపించింది— అలా— అలా—

అన్నయ్యల్ని, అక్కయ్యల్ని తలంచుకొంటూ, కుమిలి కుమిలి ఏడుస్తూనే నిద్రపోయింది.

పదిన్నరకు రామారావు తలుపుకొడుతుంటే మెలుకువ వచ్చింది.

' అప్పుడే నిద్రే ! ' అదోలా నవ్వుతూ అంటున్న రామారావుని చూసి జరగబోయే కార్యక్రమాన్ని తలచుకుని భయంతో వణికి పోయింది

ఆమె యిష్టా యిష్టాలతో పనిలేకుండా అతని కార్యక్రమం పూర్తయింది ఆమె భయం, అసహ్యం ఓమూలకుతోసి వివస్త్రగా అతని చేతుల్లో నలిగిపోయింది మండే గుండెల్లో ప్రేమ.

● ● ●

చి॥ సౌ॥ ప్రేమకు ఆశీర్వదించి వ్రాయునది నీవుత్తరం చూస్తుంటే నువ్వింకా

మొగ్గలాగే వున్నావనిపిస్తుంది. నీ మనసింకా పూర్తిగా వికసించలేదు. మన సమాజంలో బ్రతికినంత తేలికకాదు అక్కడ బ్రతకటం నీవు స్థైర్యంగా ఎదుర్కోవాలి. జీవితం ఓ తపస్సులాంటిది. దాన్ని సాధించడానికి సహనం కావాలి. ఓర్పు, సహనం భగవంతుడు నీకు ప్రసాదించాలని, నిన్ను నేను ఆశీర్వదిస్తున్నాను. స్వామీజీ వ్రాసిన ఉత్తరం చదువుతూ అక్కడే నిలబడిపోయింది ప్రేమ

ఎవరి పాపోవచ్చి ప్రక్కన నిలబడి ముచ్చటపడి ఎత్తుకుని లోపలకు తీసుకువెళ్లి బజ్జీలు పెట్టింది.

అంతలో తల్లి కాబోలు వెతుక్కుంటూ వచ్చింది. తీరిగ్గా తింటున్న కూతురు వీపుమీద ఒక్కటి వేసేసరికి కెవ్వుమంది.

ఎప్పుడన్నా పిల్లలు, పిల్లలు దెబ్బలాడుకుంటే ఏడవడం తప్ప ఇలాంటి సంఘటన చూడని ప్రేమ విలవుల్లాడిపోయింది. కానీ ఏమనడానికి నోరు పెగల్లేదు

' ఎవరేది పెడితే అది తింటావటే ముదనష్టపుదానా! అంత కులం, గోత్రం తెలీకుండా వున్నావటె—' బరబరా యీడ్చుకువెళ్తూ అంటున్న మాటలకు నిశ్చేష్టితమై నిలబడి పోయింది. పసిపిల్లనలా నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తున్న మాతృమూర్తిని— స్త్రీని— కనుమరుగైనంతవరకూ చూస్తుండి పోయింది ప్రేమ.

' అందుకేనమ్మా మనలాటి ఇళ్లల్లో యిలాటివాళ్లు పనికిరారని నేను ముందేచెప్పాను ' చోద్యంచూస్తున్న మామ్మగారు బుగ్గలు నొక్కుకుంది.

వెంటనే తలుపు వేసుకుంది వణికే కాళ్లతోవచ్చి మంచంమీద పడిపోయింది. ' ఛీ— వీళ్లు మనుష్యులేనా! ఎదుట వారిని హింసించి ఆనందించటమేనా వాళ్ల పని ఇంతేనా వీళ్లకు తెలిసింది. ' అనుకుంటూన్న మనసు సమాజంలోకి వెళ్లి పోయింది

రామారావు పిలుపుతో యీ లోకంలోకి వచ్చింది ' ఏం అలావున్నావ్! ' వస్తూనే అడిగాడు. జరిగిందంతా చెప్పింది. కళ్లనిండుగ నీళ్లు కదులాడుతుంటే—

ఓస్! అంతేనా, ఏం వున్నమాటంటే వులిక్కిపడ్డారు. నీ కులమేదో నీకు తెలుసా? ఏదో వెధవ ఆదర్శాలంటూ నేను కాబట్టి చేసుకున్నాను అటు మావాళ్లకు సుఖంలేదు. ఇటు నాకు సుఖంలేదు— ఏదంటే

దానికే మొహం చిట్లించుకొంటావ్ !— సరే గాని రేపు మా అమ్మ వస్తుందట. ఆవిడకి మడి, ఆచారం ఎక్కువ జాగ్రత్తగా వుండు! ఆర్డర్ జారీచేసాడు.

'ఏదంటే దానికే!' అంటే, అతను కోరినప్పుడంతా బట్టలు విప్పి అతను ముందు నిలబడాలి అదే! అతని వుద్దేశ్యం ఏడవలేని నవ్వు ఒకటి ఆఎండిన పెదాలమీద వెలసి రంగు మాసిపోయింది. 'ఛీ! మనిషి కాదు, స్వామీజీ దగ్గర ఎంతవినయం, ఎంత నటనచేసి మోసంచేసాడు రంగులుమారుస్తున్న వూసరవెల్లి!' అనుకొంటూ వంటింట్లోకి దారితీసింది ప్రేమ.

● ● ●

వస్తూనే భాగీరథమ్మ ఎగాదిగా చూసింది, ఈసడింపుగ, 'యిలావుంది కనుకనే వాడంత సులువుగ దీనివలలో పడిపోయాడు' అనుకొంది,

విసవిసావెళ్లి నూతిదగ్గర నాలుగు బకెట్లు నీళ్లు దిమ్మరించుకొనివచ్చి। 'చూడ్రా రామం! నాకా కుంపటి, రెండు గిన్నెలు పడేస్తే వండుకు తింటాను. ఇంత బ్రతుకూ బ్రతికి దానిచేతికూడు తినలేను— ఏ ముహూర్తాన దాన్ని చేసుకొన్నవో ఇంటిగడప తొక్కలేదు. నువ్వూరుకున్నట్టు మేము వూరుకోగలమా?—

కన్నకడుపు నాయనా— ఆముసలాయన మంచం మీద పడి ఒకటేపోరు— గడ్డాలు రాగానే మీదారి మీరు చూసుకుంటారు. తల్లి, తండ్రి, ధ్యాసఎందుకుంటుందిరా'— పురాణం చదివేసరికి రామారావు కిక్కురుమనలేదు.

అంతమడి ఆచారం ఏడిస్తే ఇక్కడికెవరు రమ్మన్నారు. సంకుచితత్వం మనస్సునిండా నింపుకుని, జీడోడుతున్న గుడ్డను నీటిలో ముంచి ఒంటిమీద వేసేసుకున్నంత మాత్రాన మడి అయిపోతుంది కాబోలు, ఛీ ఏం మనుష్యులు. ఎంతసేపూ ఎదుటి మనుష్యుల్ని దుయ్యబట్టటమే వీళ్లకు తెలిసిన సంస్కారం కసితో మండిపోయింది మనసు తల్లి వున్న నాలుగు రోజులు మడిగా వండిపెడుతుంటే ఆగది వదలిరాలేదు రామారావు పెళ్లాం తింటుందో లేదో కూడా మరచిపోయాడు. ఆ యింట్లో కాలే కడుపుతో, రగిలే మనసుతో మరో మనిషి వుందన్న జ్ఞానమే నశించి పోయింది ఆ యిద్దరికీ

'ఎందుకమ్మా, నువ్వేం బాధపడకు వచ్చే నెలనుండి జీతం అందగానే పంపిస్తా

ను కదూ ! మాటిచ్చి మరీ బండి ఎక్కించాడు

తల్లి ని దిగవిడచిన వెంటనే ఏమీ జర గనట్లు మాట్లాడుతూ మంచం మీదకు రమ్మంటున్న రామారావ్‌లో ' ఇది ' అని చెప్పలేని భావం కనుపించింది ప్రేమకి

కెలండర్‌లో మరో రెండు కాగితాలు మారేసరికి ఇహ తనకక్కడ తనదంటూ తనకేం లేదని తెలిసిపోయింది ప్రేమ కి. ప్రేమ, అభిమానం, ఆప్యాయతలే కాకుండా తిండికూడా కరువయింది నాటకాలు, వేషాలు, అంటూ ఎక్కడెక్కడో తిని వచ్చేవాడు అలా— అలా— మనిషి దూరమైపోతుంటే— అతన్నెలావారించాలో— ఎలా దారిలోకి తేవాలో కొంచెంకూడా అర్థంకాలేదు జరుగుతున్నదాన్ని నిర్లిప్తంగా భరించడం నేర్చుకొంది స్వామీజీ రంగరించి పోసిన ఓర్పు సహనం ఎంతవరకూ సహకరిస్తున్నాయో చూసుకొనే ఓపికలేని జీవచ్ఛవం అయిపోయింది ప్రేమ.

ఆ నాటి కి మూడు రోజులయ్యింది రామారావు ఇల్లు వదిలివెళ్లిపోయి ఇంట్లో పోలేదు బియ్యం లేవు ఏం చెయ్యాలో తోచని స్థితిలో విసిగి వేసారిపోయిన మనసు ఇక ఏమాత్రం భరించలేనట్టు నీరసించి పోయింది తిండిలోపం వల్ల ఏర్పడిన బలహీనత, శరీరాన్ని ఏమాత్రం అదుపులో వుంచలేక పోతోంది. అలసినమనసు, నీరసించిన శరీరం స్వామీజీ కోసం అతని చల్లని మాటలకోసం పరితపించి పోతున్నాయ్ ! ఎటుకాని వున్నా దావస్థలో ఒకనిశ్చయానికి వచ్చేసింది ప్రేమ

● ● ●

' శ్రీరామారావుగార్కి,

చాలాదయతో, ఎంతో ఆదర్శవంతంగా నన్ను మాసమాజంనుండి తీసుకొచ్చారు, కానీ— కానీ— మీసమాజం, దాంతోపాటు మీరు కూడా నన్ను ఎన్నివిధాలా హింసించాలో అన్నిధాలా హింసించారు నేను మీ సంకుచిత సమాజంలో వూసరవెల్లుల్లా రంగులు మార్చే మనుష్యుల మధ్యనే నుండలేను అందుకే మాసమాజంలోకి వెళ్లిపోతున్నాను. మీ స్నేహితులము oదు పలికిన ప్రగల్భాల కోసం చేసుకొన్న యీపెళ్లి మీకు అంతము ఖ్యమనుకోను. మీ మాటలు, చేతలుద్వారా ఇన్నాళ్ల మీసహచర్య లో తెలుసుకోలేని, తెలివి హీనురాల్ని కాదు నిరభ్యంతరంగా ఇంకో పెళ్లి చేసుకోవచ్చును. ఈసారైనా మరో అమ్మాయి జీవితంతో చెలగాటం ఆడకుండా నిజంగా భార్యలాగే చూడగలిగితేనే

చేసుకోండి. అంతేకానీ, నాలాంటి అభాగ్యురాలను ఆమెను చేయవద్దు. సమాజానికి మాత్రం రావద్దు. వచ్చి దాన్ని అపవిత్రం చెయొద్దని ప్రార్థిస్తున్నాను చెయ్యరనే ఆశతో నే శలవ్ తీసుకొంటున్నాను,

'ప్రేమలత.'

పుత్తరం పూర్తయేసరికి కళ్లు నీటితో నిండిపోయాయి. ఒక్కసారి గదంతా కలియచూసి తనది అనుకొన్న చీరకట్టుకొని బయలు దేరింది,

సమాజం దగ్గరవుతున్నకొలది. ఏదో తెలియని ఆనందం, స్వేచ్ఛ అనుభవించసాగింది పంజరం నుండి బయటపడ్డ పక్షిలా ఏంతో ఆనందించగలిగింది,

ఏదో కాగితాలు చూస్తున్న స్వామిజి పాదాలముందు మోకరిల్లిన ప్రేమను చూడగానే అంతా అర్థమైపోయిందాయనకు నిర్లిప్తంగా లేవనెత్తి దగ్గరకు తీసుకున్నారు 'ప్రేమా ! నా తల్లీ ! తప్పంతా నాదేనమ్మా నువ్వు అందరి లాంటిదానివనే అనుకున్నానమ్మా । తీగెకు పందిరి ఆధారంలా స్త్రీకి, పురుషుడు మంచి అండఅని భావి చి అలా చేసానమ్మా, నీలాగే ఎందరినో పం పాను, వాళ్లంతా తమ బ్రతుకు బాటని చక్కదిద్దుకొన్నారు. నీ సున్నితస్వభావానికి తగినవాడు దొరికాడు కాదమ్మా ! నీకోస , నీ ప్రేమకోసం. కొత్త బిడ్డలు ఎదురుచూస్తున్నారు వాళ్ల బాధ్యత ఇకనీవే ! వెక్కి, వెక్కి ఏడుస్తున్న ప్రేమ తల నిమురుతూ ఓదార్పుగా అన్నారు

ఈవార్త ప్రాకిన మరుక్షణంలోనే "ప్రేమక్కొచ్చింది" అంటూ మూగిపోయారంతా ప్రేమ కన్నీళ్లు జాలువారుతుండగా వాళ్ల తలలు నిమురుతూ ఇన్నాళ్లు తనలో నిండిన చీకటిని దూరం చేసి ఎంతో మనశ్శాంతి ననుభవించింది, ప్రేమమయి— ప్రేమ.

నెల నెలా
విపంచి చదవడం
మీ ఉత్తమాభిరుచికి
నిదర్శనం.